
# మీరు

బి.జి.ఎస్.రావు



బొంబాయిలో నారిమన్ పాయింట్ దగ్గర టాక్సీ ఆపి దిగింది ఉదయ. టాక్సీ డ్రైవర్‌కి డబ్బు ఇచ్చి, ఎల్.ఐ.సీ, ఆఫీస్ 'యోగక్షేమ' దగ్గర్లో ఉన్న 'రివీరా' భవనంలోకి ప్రవేశించింది.

నాల్గవ అంతస్తులో ఉన్న ఇరవై ఆరవ అపార్ట్‌మెంట్ దగ్గర కాలింగ్ బెల్ నొక్కింది.

ఇంచుమించు ఒక నిమిషం అయ్యాక, ఉదయ ఇంకో రెండుసార్లు కాలింగ్ బెల్ నొక్కాక, నస్సెర వాంజి గారు అబ్జర్వేషన్ విండోలో చూసి, వచ్చింది మేనకోడలేనని తెలుసుకుని తలుపు, తీశారు.

మధ్యాహ్నం మూడయింది. నస్సెర్ వాంజీగార్ని చూడగానే మంచి నిద్రలో ఉన్న మనిషిని లేపానని గ్రహించింది ఉదయ.

"సారీ, మావయ్యా మీ నిద్ర పాడుచేశాను".

"పరవాలేదు ఉదయా లోపలికి వచ్చి కూర్చో. మీ ప్రయాణం ఎలా జరిగింది? మొన్న దర్శనం బాగా జరిగిందని చెప్పాడు బలరాం"

"మామయ్యా ఎన్నో ఆశలు పెట్టుకుని తిరుపతి వెళ్ళాం మేము. మొదటిసారి దర్శనానికి ఆరు గంటలు పట్టింది. అది ధర్మదర్శనం"

"అవునమ్మా తిరుపతి దేవుడి దర్శనం కావాలంటే నాలుగైదు గంటలయినా పడ్తుంది".

"కానీ, ఆ మర్నాడు అరగంటలో ధర్శనమయి పోయింది.

ప్రత్యేక దర్శనానికి ఇరవై అయిదు రూపాయలు పెట్టి టిక్కెట్టు కొన్నాం. మా ఆయన ముందు ఒప్పుకోలేదు. కానీ ఆ తర్వాత టిక్కెట్లకయ్యే డబ్బు నేనిస్తానంటే ఏమీ అనలేదు.

అప్పుడే ఆ గదిలోకి ప్రతిమ వచ్చింది.

"అత్తా మీ కోసం ప్రసాదంకొని నా సూట్‌కేసులో పెట్టాను. తిరుపతి నుంచి బొంబాయి వచ్చేటప్పుడు మేము కడపలో రెండు

రోజులున్నాం. కడప నుంచి బొంబాయి దాదార్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చాం। ట్రైన్‌లో నా సూట్‌కేసు ఎవరో కొట్టేశారు" ఉదయ బాధగా అంది.

"ఉదయా, అప్పుడే మూడున్నరవుతోంది. నేను వెళ్ళాలి. నాలుగింటికి నాకో చిన్న పని ఉంది. టా టా" అంటూ వెళ్ళిపోయింది అక్కడి నుంచి ప్రతిమ. ఉదయ మనస్సు చివుక్కుమంది. తనేమో ఎంతో దూరంనుంచి టాక్సీలో అత్తనీ, మామనీ కలుద్దామని వచ్చింది. కానీ, తను ఇలా వచ్చిందో లేదో అత్త వేరే పని ఉందని వెళ్ళిపోయింది. ఎంతో దూరం నుంచి వచ్చిన తనకు ఒక కప్పు టీ కూడా ఇవ్వలేదు. మండుటెండలో వచ్చిన తనకు కనీసం మంచి నీళ్ళయినా ఇవ్వలేదు.

అయినా, అత్త వెళ్ళిపోవడం ఉదయకి బాగానే ఉంది. ఆమెలేకపోతే నస్సెర్ వాంజీ మామ తనతో బాగా మాట్లాడుతాడు. ప్రతిమ తనకు మేనత్త అవుతుంది. అయినా నస్సెర్ వాంజీ మామ తనకు ఎంతో దగ్గర బంధువూ. ఆత్మీయుడు అనే భావం తనకు ఉంది.

"అమ్మా, మీపిల్లలు ఎలా ఉన్నారు? వాళ్ళకు పరీక్షలలో ఎన్నవ స్థానం వచ్చింది? ఇంకా ఏమిటి విశేషాలు?"

"మామా, పిల్లలకి పరీక్షల్లో మంచి మార్కులు వచ్చాయి. వాళ్ళగురించి బాధ లేదు. నా బాధ నా సూట్‌కేస్ గురించే.

"ఉదయా, చిట్టి తల్లీ. పోయిన సూట్‌కేస్ గురించి ఎందుకమ్మా చింత? అది పోయి వారం రోజులైంది. ఇక, ఆవిషయం మర్చిపో".

"మామయ్యా నేను బాధపడుతున్నది సూట్‌కేస్ గురించి కాదు. ఓ మూడు వందల రూపాయలు నావి కావనుకుంటే, మళ్ళీ ఇంకో సూట్‌కేస్ కొనుక్కోవచ్చు. అసలు సమస్య చెప్తాను నీకు. మా పెళ్ళయినప్పట్నించీ మేం హనీమూన్‌కి వెళ్ళలేదు. ఈ మధ్యే పరిస్థితులు మారాయి. పెళ్ళయిన అయిదేళ్ళకు పిల్లలతో ప్రేమ యాత్రకి వెళ్తున్నాం అని ఎంతో గొప్పగా నాతో పనిచేస్తున్న టీచర్లందరికీ చెప్పుకున్నాను. వాళ్ళందరూ మీ ప్రేమ యాత్ర ఎలా జరిగిందంటే ఏం చెప్పాలి? నేనేం చెయ్యాలి ఇప్పుడు? ప్రయాణంలో సూట్‌కేస్ పోయిన విషయం వాళ్ళకు తెలిశాక, నేను నా మొహం మా స్కూల్లో ఎలా చూపించాలి

"పిచ్చితల్లి, ఎందుకమ్మా ఇంత బాధ జరిగిపోయినదానికి? అసలు నీ పెట్టె పోయినట్టు వాళ్ళకెందుకు చెప్పాలి?"

"మామా, ఆ విషయాయం మా స్కూల్లో చెప్పి తీరాలి. సాటి టీచర్లందరికీ తెలుస్తుంది కూడా. ఆ సూట్‌కేస్‌లో మా పిల్లలు మొన్న రాసిన పరీక్షల ఆన్సర్ - బుక్స్ ఉన్నాయి. ఇప్పుడు మళ్ళీ వాళ్ళకు మా హెడ్ మిస్ట్రెస్ అనుమతి తీసుకుని, పరీక్ష పెట్టాలి. నాకిప్పుడు బతకాలని లేదు. నేను చచ్చిపోతాను".

"సరే, నేను నీ కొక కథ చెప్తాను. ఆ కథ విన్నాక కూడా నీకు చచ్చిపోవాలంటే నీ ఇష్టం. కథ చెప్పనా ఉదయా?"

"మామయ్యా నువ్వొక రచయితవి. మా అత్తతో పెళ్ళాయ్యాక నువ్వు మా తెలుగుభాష చక్కగా నేర్చుకున్నావు. చదువుకున్నావు. నీ వాక్చాతుర్యంతో నాకేదో చెప్పి, విరిగిపోయిన నా మనస్సుని బాగుచెయ్యాలనా నీ ప్రయత్నం?"

"ఉదయా, నేను చెప్పబోయేది కట్టు కథ కాదు. ఇది నిజంగా జరిగిన కథ. సరే, మీ అత్తయ్య ఐస్‌క్రీం చేసింది. ముందు అది తిను. తర్వాత కథ చెప్తాను" అంటూ నస్సెర్ వాంజీ ఆమె ముందర ఐస్‌క్రీం ఉంచాడు.

నస్సెర్ వాంజీగారు కుర్చీలోంచి లేచి రేడియోలో వివిధ భారతి స్టేషన్ ట్యూన్ చేశారు. వివిధ భారతిలో దక్షిణ భారత సంగీత సభ మొదలైంది. తెలుగు పాటలు వస్తున్నాయి. "వెలుగు నీడలు" సినిమాలో పాటతో తెలుగు పాటల కార్యక్రమం ఆరోజు ప్రారంభించారు.

"కలకానిది, విలువైనది
బతుకు కన్నీటి ధారలకు బలి చేయకు"

ఆ పాట విన్నాక నస్సెర్‌వాంజీ గారు ఉత్సాహాన్ని మరి కొంత పుంజు కున్నారు.

"చూడమ్మా ఉదయా - జీవితం మనకు ఈశ్వరుడు ఇచ్చిన వరం. ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా, నిలదొక్కుకోవాలి. సూట్‌కేస్ పోయినంత మాత్రాన చచ్చిపోవాలనుకోవడం సమంజసం కాదు. సరే, ఇంక అసలు విషయానికొద్దాం.

"బొంబాయి రావడానికి ముందు అహ్మదాబాద్‌లో పనిచేసే వాడ్ని నేను. నారాయణపురాలో ఒక ఇండిపెండెంట్ ఇల్లు అద్దెకు తీసుకుని ఉండేవాడ్ని నా భార్య ప్రతిమతో మా ఇద్దరి భాషలు మతాలు వేరైనా, మేము ఎంతో సంతోషంగా ఉండేవాళ్ళం. కొంత కాలమయ్యాకా, మా తమ్ముడికి అహ్మదాబాదు బదిలీ అయింది. మొదట తమ్ముడు నటరాజ్ ఒక్కడే వచ్చి, మా ఇంట్లో వారం రోజులున్నాడు. ఆ సమయంలో తమ్ముడికి ఒక రోజు చిన్ననాటి స్నేహితురాలు యశోద కన్పించింది. యశోదని మా తమ్ముడు సాదరంగా పలకరించి ఇంటికి ఆహ్వానించాడు. నేను ఇంట్లో లేను. కానీ తమ్ముడు యశోదని తన వదినెకు పరిచయం చేశాడు. ఆ రోజు కుడా ప్రతిమ ఐస్ క్రీం చేసింది".

"మామయ్యా ఐస్‌క్రీం బాగా కుదిరింది. ఇంకొంచెం పెడ్తావా?"

"దానికేం భాగ్యం తల్లీ ఆరోజు యశోదకూడా రెండవసారి ఐస్‌క్రీం వేయించుకుందిట. యశోదని మా ఇంటికి తీసుకు వచ్చిన మరో రెండు రోజులకే నటరాజ్‌కి ఇల్లు కుదిరింది. అతను వెళ్ళిపోయాడు వాళ్ళ ఇంటికి".

"ఇంతకీ యశోద ఏం చేస్తోంది మామా?"

"యశోద...అవునమ్మా యశోద గురించే నేను చెప్పేది. యశోదా, నా తమ్ముడు పాలిటెక్నిక్‌లో క్లాస్‌మేట్స్. నటరాజ్ పాలిటెక్నిక్‌లో కోర్స్ పూర్తి అయ్యాకా, ఇంకా ఇంజనీరింగ్‌లో పెద్ద చదువులు చదివాడు. కానీ, పాలిటెక్నిక్ కోర్స్ మధ్యలో ఆపేసిన యశోద మా తమ్ముడి కంటే ఎన్నో రెట్లు డబ్బు సంపాదించింది ఉదయా....ఆరోజు నాకు బాగా జ్ఞాపకం. జూన్ ఇరవై తారీఖు సాయంకాలం అయిదున్నరకు మా ఇంటికి యశోద వచ్చింది. తనని తాను పరిచయం చేసుకుంది. నాకు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పింది. ఆశ్చర్యంతో అడిగాను. నా పుట్టిన రోజు అన్న విషయం మీకెలా తెలుసని?"

యశోద అంది. "మీ తమ్ముడు నటరాజ్ తన పుట్టిన రోజున నాకొక చిన్న పార్టీ ఇచ్చాడు. ఆ సందర్భంలో ఆయన చెప్పాడు మా అన్న కూడా జూన్‌నెలలోనే పుట్టినట్లు, ఇరవయి తేదీ పుట్టిన రోజని".

"అవును, మామా. పుట్టిన రోజున ఎవరు శుభాకాంక్షలు చెప్పినా సంతోషమే".


"ఉదయా, ఆ రోజు మీ ప్రతిమత్త నాకు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పలేదు. అటువంటప్పుడు గోరంత కూడా పరిచయం లేని యశోద నాకు శుభాకాంక్షలు చెప్పి, నా గుండెలో స్పందనని కలిగించింది. నా మనసు పులకరించింది వెంటనే ఆమెకోసం టీ చేశాను".


టీ తాగుతూ యశోద మొదలు పెట్టింది.

"నేను ఎన్నిసార్లు ఎన్నో చోట్ల టీ తాగుతూ ఉంటాను. కానీ మీరు ఇచ్చిన ఆతిధ్యంలో ప్రత్యేకత ఉంది. చాలా మంది టీ కప్పుని పింగాణీ సాసర్‌లో పెట్టి ఇస్తారు. సాసర్ తడిగా ఉంటుంది. సగం టీ అందులో ఒలికిపోయి ఉంటుంది. మీరు టీ స్టెయిన్‌లెస్ స్టీల్ గ్లాసులో పెట్టి ఇచ్చారు. అడుగున ఉన్న స్టెయిన్ లెస్ సాసర్ పొడిగా ఉంది. మా ఇంట్లో మా వారికి నేనిలాగే టీ ఇస్తాను. అంతేకాదు; టీ బ్రహ్మాండంగా ఉంది. ఇవన్నీ నేను ముఖప్రీతికి చెప్పేమాటలు కావు. ఈ మాటలు వస్తున్నది నా నోట్లోంచి కాదు. నా హృదయంలోంచి. మీరు నన్ను నమ్మండి".

"యశోద గలగలా నవ్వింది. ఉదయా, ఆమె నవ్వు కోటికోట్ల రూపాయలనిపించింది నాకు. ఆమె మాటలు నమ్మకుండా ఉండలేక పోయాను".

"మామా, ఆమె నవ్వు విలువ కోటి కోట్ల రూపాలన్నావు. ఆ అందాలరాశి యశోదని






చూడాలని ఉంది నాకు".

"నువ్వామెని చూడకుండా ఉంటేనే బావుంటుంది. ఆమెను చూస్తే, నువ్వు నిర్మించుకున్న ఊహా చిత్రం నేలపాలవుతుంది. నా నలభై ఏళ్ళ జీవితంలో అంతకురూపిని చూడలేదు. ఉదయా, ఇంతకీ నా దగ్గరకు యశోద ఎందుకు వచ్చింది? పత్రికలలో నా కథలు చదివిందట. కొన్ని నవలలు కూడా నావి చదివింది. నా రచనలు ఆమె మనసు మీద చెరగని ముద్ర వేశాయట. నన్ను ఇంటర్వ్యూ చేసి ఆ సంభాషణని పత్రికలలో అచ్చు వేయిస్తానని చెప్పింది. నాతోటి ఇంచుమించు మూడు గంటల సేపు మాట్లాడాలని, రోజుకొక గంట చొప్పున మూడు రోజులు మా ఇంటికి వస్తానని చెప్పింది. నేనూ ప్రతి రోజూ ఉదయం ఏడున్నరకు వస్తే ఫ్రీగా ఉంటానని, నా రచనల గురించి, జీవితం గురించి ఏది అడిగినా సమ్మతమేనని అన్నాను. ఆ మర్నాటి నుంచి మూడు రోజులు నేను చెప్పిన సమయానికి వస్తానని చెప్పి వెళ్ళిపోయింది"

"మరి ఆ తర్వాత ఏమయింది మామా?"

"చూడమ్మా ఉదయా...మొత్తం కథ జరిగింది జరిగినట్లు అంతా చెప్తాను. కానీ, ఇప్పుడు వేరే పనుంది నాకు. నువ్వు రేపు వస్తే బావుంటుంది".

"ఎన్నింటికి రావాలంటావు, నస్సెర్‌వాంజీ మామా?"

"రేపు ఉదయం ఏడున్నరకురా. ఆ టైముకల్లా మీ ప్రతిమత్త స్కూల్‌కు వెళ్ళిపోతుంది. ఫ్రీగా ఉంటాను"

ఉదయ మర్నాడు ఉదయం ఆరింటికే నిద్రలేచింది.

ఆలస్యాలన్నీ తీర్చుకుని, పావుతక్కువ ఏడుకు సయాన్ స్టేషన్ చేరుకుంది. ఎలక్ట్రిక్ ట్రైన్‌లో చర్చ్ గేట్ స్టేషన్‌కి బయలుదేరింది. స్టేషన్ దగ్గర్లో ఒక పత్రికా కార్యాలయంలో ఉన్న తన మిత్రుని అర్జెంట్‌పనిమీద కలుసుకుంది. మిత్రుడు తుషార్ భాయి టీ ఇస్తే తాగింది ఉదయ. చర్చ్ గేట్ స్టేషన్ నుంచి నారీమన్ పాయింట్ ప్రాంతంలో ఉన్న నస్సెర్ వాంజీ గారి ఇల్లు దగ్గరే కాబట్టి నడిచి వెళ్ళిపోయింది.

సమయం సమంగా ఏడు గంటల ఇరవై అయిదు నిమిషాలు. రివీరా బిల్డింగ్ ఇరవై ఆరవ ఎపార్ట్‌మెంట్ చేరుకున్నాక కాలింగ్ బెల్ నొక్కింది ఉదయ.

అప్పుడే స్నానంచేసి తయారయిన నస్సెర్‌వాంజీగారు తలుపు తీశారు. సమంగా ఏడున్నరకి ఆయన డ్రాయింగ్ రూమ్‌లోకి అడుగుపెట్టి, జరిగిన కథ ఉదయతో చెప్పడం మొదలు పెట్టారు.

"నస్సెర్‌వాంజీగారూ మీ మాతృభాష మరాఠీ అయినా, ఆ భాష మాట్లాడుతున్నప్పుడు అది ఇంగ్లీషులా ఉంటుంది. ఇంకోటేమిటంటే, మీరు ఇంగ్లీషు మాట్లాడుతుంటే నాకు చాలా బావుంటుంది. మీరు మొదట్నించి ఇంగ్లీషు మీడియంలోనే చదివారా? యశోద నన్నడిగింది.

"లేదమ్మా యశోదా నేను ఎనిమిదవ తరగతి దాకా మరాఠీ మీడియంలో చదివాను. కానీ మా నాన్న ఇంట్లో ఎప్పుడూ ఇంగ్లీషులో మాట్లాడమని మామీద ఒత్తిడి తెచ్చేవారు".

"అయ్యా మీరు మరాఠీలో, ఇంగ్లీషులో రాసిన కథలు నవలలు చదివాను మీ కథలలో పాత్రల చిత్రీకరణ ఆ తర్వాత కథ చెప్పే తీరు ఎవరికైనా నచ్చుతుంది. ఇంకా ఎక్కువగా చెప్పాలంటే నచ్చి తీరాలి".

"యశోదా, నన్ను నీ పొగడ్తలతో ఇబ్బంది పెట్టేస్తున్నావమ్మా!"

"నస్సెర్‌వాంజీగారూ, అలా అనుకోవద్దు. నేను విన్నదేమిటంటే మీరు రోజుకు ఒక కథ అయినా రాస్తారని, ఈ మధ్యకాలంలో మీరు రాసిన రెండు కథలు, ఇంకా ఎక్కడా ప్రచురణ అవని కథలు, వ్యాసాలు మీరు చూపిస్తారా?".

"తప్పకుండా చూపిస్తాను యశోదా" - అంటూ ఆవారంలో నేను రాసిన రెండు కథలు ఆమె ముందుంచాను. ఇంచుమించు ఇరవై నిమిషాలసేపు ఆమె ఆ కథలు చదివింది. నా రచనా నైపుణ్యాన్ని ప్రశంసించింది. నాలో ఉన్న ఆత్మవిశ్వాసాన్ని ద్విగుణీకృతం చేసింది. నిర్మాణాత్మకమైన విమర్శలు చేసింది.


"అంతేకాదు, ఉదయా - తర్వాత యశోద మా డ్రాయింగ్ రూమ్‌లో ఉన్న షోకేస్‌లో ప్రతి వస్తువును తరచి తరచి చూసింది. ఇంట్లో ఉన్న ప్రతీ వస్తువుని కొనడంలో నేను చూపించిన సామర్థ్యాన్ని ఆమె ఎంతో పొగిడింది. ఆమె నా పట్ల, నా రచనల పట్ల చూపించిన ఆసక్తి వల్ల ఆమె ఎంత కురూపి అయినా, ఆమె అంటే రెండు రోజులలోనే నాకు అంతులేని ప్రేమ, విపరీతమైన అభిమానం ఏర్పడ్డాయి.

"నేను చెప్పిన ప్రతి మాట ఆమె తన కేసెట్ రికార్డర్ సహాయంతో రికార్డ్ చేసుకునేది. నానోటి నుంచి వచ్చిన ప్రతీ వాక్కు ఆమె షార్ట్ హేండ్‌లో తన నోట్ బుక్కులో రాసుకునేది. నన్ను ఇంటర్వ్యూ చేస్తానంటూ వచ్చిన మొదటి వ్యక్తి యశోదే".

నస్సెర్‌గారూ యశోద గురించి చెప్పుకుంటూ పోతున్నారు.

"రచనల గురించి, నా జీవితం, నా బంధువర్గం గురించి ఆమె నన్ను అడగడం ఆమెకు నేను చెప్పడం అయింది. షోకేసులో ఉన్న ప్రతీ వస్తువు ఆమెకు నచ్చిందని చెప్పాను కదా. తర్వాత నేనే ఆమెని ఇల్లంతా చూడమని

# వ్యాయామం - క్రీడలు



**66** ఏళ్ళు దాటిన శ్రీ కె. రామయ్య వ్యాయామ క్రీడల్లో ఆసక్తి కల్గి దండేలు, బస్కీలు, కుస్తీల్లో వ్యాయామం ప్రారంభించి జాతీయ స్థాయి బరువు లెత్తే క్రీడాకారుడుగా పేరు సంపాదించారు. వీరిది గుంటూరు జిల్లా, తెనాలి తాలూకా. పెరవలి గ్రామ వాస్తవ్యులు. 1940-41లో పాఠశాల విద్యార్థి దశలో గుంటూరు జిల్లా విద్యార్థుల వ్యాయామ పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి పొందారు. అదే వారి వ్యాయామ కృషికి నాంది. తర్వాత పడమటలంకలోని శ్రీ ఏ.పి. రంగా దగ్గర బరువు నెత్తు క్రీడలో శిక్షణ పొంది రాష్ట్రస్థాయి ఫెదర్ వెయిట్ బరువు నెత్తే పోటీలలో అగ్రస్థానం వహించారు. 1960-61 ఢిల్లీలో జరిగిన జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్ర ప్రతినిధిగా పాల్గొన్నారు. ఆనాటి ప్రముఖ బరువు నెత్తే క్రీడాకారులైన డా॥ వి. సీతారామాచార్యులగారితో కలిసి అనేక గ్రామాల్లో ప్రదర్శనలు ఇచ్చి క్రీడా ప్రచారం చేశారు. రాష్ట్ర సహకార శాఖలో డిప్యూటీ రిజిష్ట్రారుగా 1976లో పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి ఉద్యోగ బాధ్యతలు లేవు కాబట్టి, ఈనాటికీ అనేక మంది యువకులకు శిక్షణ ఇస్తూ క్రీడా సేవ చేస్తున్నారు. గుంటూరు జిల్లా బరువు నెత్తే సంఘానికి కార్యదర్శిగా ఉంటూ అనేక పోటీల నిర్వహణకు నిర్విరామ కృషి చేస్తున్నారు.

- ఏకా

ఆహ్వానించాను. నన్నూ నా ఇంటిని పొగిడి సెలవు తీసుకుంది యశోద''.

"కానీ, ఆమె నీదగ్గరికి మూడు రోజులు వస్తానని చెప్పింది కదా, మామా?''

"అవును ఉదయా ఇరవై రెండవ తారీఖున ఆమె కోసం నేను ఉదయం ఏడున్నర నుంచి నిరీక్షణ చేస్తూ గడిపాను. తొమ్మిది దాకా ఆమె రాలేదు. నాకు నిరుత్సాహం కలిగింది. సమంగా తొమ్మిది గంటల అయిది నిమిషాలకు మా కాలింగ్ బెల్ శబ్దం వినిపించింది. తలుపు తీశాను. ఉదయా, వచ్చింది యశోద కాదు'' నిరుత్సాహంగా అన్నారు నస్సెర్‌వాంజీగారు.

"మరి ఆ వచ్చింది ఎవరో" కుతూహలంగా అడిగింది ఉదయ.

"నాకొక టెలిగ్రాం. రాజ్‌కోట్‌లో ఉన్న మా చెల్లెలు, నా ఒక్కగానొక్క చెల్లెలుకి ఎంతో సీరియస్‌గా ఉంది. వెంటనే రాజ్‌కోట్ రావాలని అందులో సందేశం. యశోదకోసం నిరీక్షించేశక్తి సమయం లేవు. పదింపావుకి రాజ్‌కోట్ వెళ్ళడానికి బస్సు ఉంది. అందులో నేను ఆ ఊరికి వెళ్ళాను.''

"రాజ్‌కోట్ నుంచి వచ్చాక, తిరిగి యశోద నిన్ను కలిసిందా మామా?''

"ఉదయా, నేను రాజ్‌కోట్ వెళ్ళేసరికి మా చెల్లెలు హాయిగా నవ్వుతూ, తిరుగుతూ కన్పించింది. విషయం చెప్పి, ఇదేమిటని దాన్ని అడిగాను. టెలిగ్రాం సంగతి తనకేమీ తెలియదని చెప్పింది మా చెల్లెలు. మర్నాడు నేను అహ్మదాబాద్ వెళ్ళాను. నేను రాజ్‌కోట్ వెళ్ళడానికి ముందరే బరోడా వెళ్ళిన మీ ప్రతిమత్త ఇంకా రాలేదు.''

"తర్వాత ఏమిటి మామా?''

"ఇంట్లోకి వెళ్ళే సరికి, ఆ మాటకొస్తే ఇంకా లోపలికి పోకుండానే నాకేదో భయం వేసింది. ఇవతల ఉండాల్సిన నా నేమ్ ప్లేట్ లేదు. లోపలికి వెళ్ళాక, నాకు పెద్ద షాకు తగిలింది. ఇల్లంతా ఖాళీగా ఉంది. లోపల ఉన్న ఫర్నీచర్, బీరువాలు, పెట్టెలు, గిన్నెలు, రేడియో, టెలివిజన్.....ఒకటేమిటి అన్నీ తీసుకుపోయారు దొంగలు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, తీసుకుపోయింది దొంగ. ఇదంతా ఎలా జరిగింది అని ఆశ్చర్యమవసరం లేదు. మా ఇంట్లో ఉన్న ప్రతీ వస్తువుని జాగ్రత్తగా చూసింది యశోద. బయటికి వెళ్ళిన నా భార్య తన తాళం చెవుల గుత్తిని ఇంట్లో మరిచిపోయింది. ఆ విషయం నాకు తెలియదు. ఇల్లంతా లోపలికి వచ్చి చూసిన యశోద ఇది గమనించి, ఆగుత్తిని తను తీసుకుంది.

"మామా, ఆమె దగ్గర తాళాల గుత్తి ఉన్నా మొత్తం సామాన్లన్నీ ఎలా తీసుకుపోయింది యశోద?''

"ఎలా ఎలా అంటే ఇలా... చెప్తాను విను. యశోద భర్తలారీ డ్రైవర్, ఓనర్. వాళ్ళదగ్గర నలుగురయిదుగురు లేబర్ కూడా ఉన్నారు. మా రాజ్‌కోట్ బస్సు బయల్దేరిన కొంచెం సేపట్లో యశోద లారీ మా ఇంటి ముందర వాళ్ళ మనుష్యులతో సహా ఆగింది. రెండు, మూడు గంటలలో ఇల్లంతా ఖాళీ చేశారు వాళ్ళు.''

"మరి ప్రక్కన వాళ్ళంతా ఏం చేస్తున్నారు, మామా?''

"పక్క వాళ్ళగురించి పట్టించుకునేది, అసలు పక్క వాళ్ళెవరో ఈ రోజుల్లో మహానగరాల్లో ఆలోచించేందుకు ఎవరికుంది సమయం? ఒకవేళ ఎవరన్నా చూసినా, ఇల్లు ఖాళీ చేస్తున్నారేమో అనుకుంటారు. అందులో మాది. ఇండిపెండెంట్ ఇల్లు''

"కానీ, ఇంతకీ ఆ కురూపి వలలో నువ్వెలా పడ్డావు మామా?''


"సాహితీ ప్రపంచంలోనూ, కళారంగంలోనూ, నేను చెస్తున్న కృషిని యశోద గుర్తించింది. నాతో అన్నీ వివరంగా మాట్లాడింది. మా ఇంట్లో ఉన్న ప్రతి వస్తువు గురించి నన్ను క్షుణ్ణంగా గుచ్చి గుచ్చి అడిగింది. నేనామెకు మా బీరువాలు తెరచి చూపించాను.

"అంతేకాదు. ఉదయా....ఆమె నా గురించే మాట్లాడింది నా దగ్గరకి ఆమె వచ్చిన రెండు రోజులు. మీరు ఈ వస్తువు ఎక్కడ కొన్నారు? మీరు ఏం చదివారు? మీ రచనలన్నింట్లో మీకు నచ్చిన రచన ఏది? మీ పెళ్ళి ఫోటోలు చూపిస్తారా? ఇలా ప్రతీ ప్రశ్నలో నా అహాన్ని తృప్తిపరుస్తూ తెలివిగా తన భర్త లారీడ్రైవర్ సహాయంతో ఇల్లంతా దోచుకుపోయింది. ఇదీ జరిగిన కథ.''

ఉదయకి తను చిన్నప్పుడు ఏదో పుస్తకంలో చదివిన వాక్యాలు గుర్తుకు వచ్చాయి. మనమంటే ఎదుటివారికి ఎక్కువగా ఇష్టం కలగాలంటే, మనం మన గురించి మాట్లాడకుండా, వారిగురించే మాట్లాడాలి. "మీరు" అనే పదంలోని సమ్మోహనశక్తిని వాడుకుంటూ, మనం మంచి శ్రోతలుగా ఉండాలి. యశోద సాధించిన తాత్కాలిక విజయ రహస్యం ఇదే అని ఉదయ గ్రహించింది. ఇక ఇంటికి వెళ్దామనుకున్న ఉదయని ఉద్దేశించి అన్నారు నస్సెర్‌వాంజీగారు.

"చూడమ్మా జీవితమంటే ఒకే ఒక సంఘటన కాదు. ఎన్నో సంఘటనలు, అనుభవాలు కలిస్తే, అప్పుడు దాన్ని జీవిత మంటారు. ఒడిదుడుకుల తియ్యటి కలయికే ఈ జీవితం. నా కథవిన్న తర్వాత కూడా నువ్వు చచ్చిపోవాలనుకుంటున్నావా?''

"లేదు మామా లేదు. ఆవేశంలో, నిరాశతో అన్న ఆ మాటని వాపసు తీసుకుంటాను" - అంటూ ఇంటికి బయల్దేరింది ఉదయ.



ఫోటో: ఎస్. విశ్వనాథ్ [బెంగుళూరు]